687) బౌళి

ప॥ ఎట్టువలసినా జేయు మేమీ ననేరమయ్య । వొట్టిననామనసు నీ కొప్పనసుమ్మయ్యా ॥

చ॥ అదిగో శ్రీహరి నీవంపినయింద్రియాలకు । చెదరక నేము పంపుసేతుమయ్యా ।
వెదకి యాసలకెల్లా వెట్టియు జేతుమయ్య । మదిమది నేనీమాయకు లోనయ్యా ॥

చ॥ దేవ నీవిచ్చినయట్టిదేహపుటూరిలోన । చేవమీర గాపురము సేసేమయ్య ।
ఆవల నీకర్మముల కప్పనము నత్తుమయ్య । ఆవటించి కామాదుల కాన మీరమయ్యా ॥

చ॥ నిన్ను దలచుటకంటే నీవుచెప్పినపనులే । యెన్నిక జేసినదే యెక్కుడయ్యా ।
అన్నిటా శ్రీవేంకటేశ ఆత్మలో నున్నాడవు । విన్నపములేల యిది విడువమయ్యా ॥